# రంజాన్ మాసం

( شهر رمضان )

[ తెలుగు – Telugu – تلغو ]

http://te.wikipedia.org/wiki/రంజాన్


**అనువాదం : -**

**పునర్విమర్శ :** ముహమ్మద్ కరీముల్లాహ్



islamhouse.com

2010 - 1431

# ( شهر رمضان )

« باللغة التلغو »

http://te.wikipedia.org/wiki/రంజాన్

ترجمة:

مراجعة: محمد كريم الله

islamhouse.com

2010 - 1431

# రంజాన్

'*రంజాన్* ***లేదా*** *రమదాన్* (Ramzan - Ramadan) అనేది ప్రపంచ వ్యాప్తంగా ముస్లింలు ఆచరించే ఒక ఉపవాస దీక్షా వ్రత మాసం పేరు మరియు ఇస్లామీయ కేలండర్ లోని తొమ్మిదవ నెల పేరు.

పండుగ, పర్వదినం అంటే శుభవేళ, ఉత్సవ సమయం అని అర్థం. ముస్లింలు అత్యంత పవిత్రంగా 'రంజాన్' పండుగను జరుపుకుంటారు.

ముస్లింలు 'చాంద్రమాన కేలండర్' ను అనుసరిస్తారు. చాంద్రమానాన్ని అనుసరించే ఇస్లామీయ కేలండర్ తొమ్మిదవ నెల 'రంజాన్', దీనిని ముస్లింలు అత్యంత పవిత్రమైనదిగా భావిస్తారు. దానికి ప్రధానమైన కారణం ' దివ్యఖుర్ఆన్' గ్రంథం ఈ మాసంలో అవిర్భవించడమే! క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలయికే 'రంజాన్ మాసం'.

## ఉపవాసవ్రతం

ఖురాన్ ప్రకారం రంజాన్ నెలలో విధిగా అచరించవలసిన నియమం 'ఉపవాసవ్రతం' . ఈ ఉపవాసంను పార్సీ భాషలో 'రోజా' అని అంటారు. అరబ్బీ భాషలో సౌమ్ అని పిలుస్తారు. ఈ ఉపవాస విధిని గురించి దివ్యఖురాన్ గ్రంథం ఇలా ప్రకటిస్తున్నది - "విశ్వాసులారా! గత దైవ ప్రవక్తలను అనుసరించే వారికి ఎలా ఉపవాసాలు విధిగా నిర్ణయించబడ్డాయో.......... అలాగే మీలో భయభక్తులు జనించడానికి అదే విధంగా ఇప్పుడు మీకు కూడా ఉపవాసవ్రతాలు నిర్ణయించబడ్డాయి" అని పేర్కొంది.

# నిష్ఠ - నియమాలు

రంజాన్ నెల ప్రారంభమైన నాటి నుండి ముగిసేవరకూ ముస్లింలు పగలు నిష్ఠగా 'రోజా' ఉపవాస దీక్షలను పాటిస్తారు. కేవలం ఆహారపానీయాలను మానివేయడం మాత్రమే 'రోజా' కాదు. సంపూర్ణ నిష్ఠనియమాలతో కూడుకున్న జీవన విధానమది. తెల్లవారు ఝామున భోజనం చేసిన తర్వాత ఆ రోజంతా ఉపవాసం ఉండే భక్తులు సాయంత్రం సూర్యాస్తమయం తర్వాత దీక్షను విరిమిస్తారు. తెల్లవారుఝామున తీసుకునే ఆహారాన్ని 'సహర్' అనీ, సాయంత్రం ఉపవాస వ్రత దీక్ష విరమణలో తీసుకునే ఆహారాన్ని 'ఇఫ్తార్' అంటారు. అంటే రంజాన్ నెలలో ప్రతిరోజు సూర్యోదయం కాక ముందు నుండి సూర్యాస్తమయం వరకు దాదాపు 13 గంటలుపాటు కఠిన ఉపవాస దీక్షలు పాటిస్తారు. ఉపవాసదీక్ష పాటించేవారు అబద్ధమాడకుండా, పరనిందలకు పాల్పడకుండా గడపడంతో పాటూ, శారీరక, మానసిక వాంఛలకు దూరంగా, నిగ్రహంతో వుంటూ ఆసాంతం దైవచింతనతో గడుపుతూ వుంటారు. ఈ ఉపవాస దీక్ష లక్ష్యం మనిషిలో దైవభీతి, అల్లాహ్ పట్ల నమ్మకం మొదలైన మహత్తరమైన సుగుణాలను పెంపొందింప జేయడమే! దీనిని ఖురాన్ 'తఖ్వా అంటే అల్లాహ్ పట్ల భయభక్తులు' అని అంటుంది.

# ఉపవాస విధి

రంజాన్ మాసంలో ఉపవాసదీక్షలను పూర్తి నెల రోజుల పాటు పాటించడం అనేది వయోజనులైన స్త్రీపురుషులందరికీ విధిగా నిర్ణయించబడింది. అయితే వృద్ధులు, పిల్లలు, వ్యాధిగ్రస్తులు, ప్రయాణంలో వున్నవారు ఈ విధి నుండి మినహాయింపబడ్డారు. దివ్యఖురాన్ ఉపవాస విధిని గురించి 'రంజాన్ నెలలో విధిగా నెలంతా ఉపవాసం పాటించాలి. అయితే ఎవరైనా ప్రయాణంలో వుంటే, వ్యాధిగ్రస్తులయితే వారు ఆ ఉపవాసాలను వేరే రోజులలో పూర్తిచేయాలి. దేవుడు

మీకు సౌలభ్యం కలుగజేయాలని భావిస్తూ వున్నాడు కానీ, మిమ్ములను ఇబ్బందులలో పడ వేయాలని అనుకోవడం లేదు అని పేర్కొంది. రంజాన్ అనగా ఉపవాస దీక్షలు మాత్రమే కాదు. అది మనిషిలోని చెడు భావనల్ని మరియు అధర్మాన్నీ, ద్వేషాన్నీ రూపుమాపేది కూడా. 'ఈ మాసంలో పేదవాడికి ఒక పూట నీవు ఆహారం పెడితే నీకు ఆ అల్లాహ్ అనేక రెట్ల పుణ్యాలు ప్రసాదిస్తాడు' అని ఉపదేశింపబడింది.

## గల్ఫ్ లో రంజాన్

- భారతదేశంలో ముస్లింలు రాత్రి నిద్రపోయి తెల్లవారి నాలుగు గంటలకు లేచి సహర్ చేస్తారు. అయితే గల్ఫ్ దేశాల్లోని అనేక మంది ముస్లింలు రాత్రంతా తింటూ, తమ స్నేహితులను, బంధువులను దర్శిస్తూ, షాపింగ్ చేసుకుంటూ తెల్లవారు ఝామున సహర్ భోజనం తిని, నమాజ్ చదివి పడుకుంటారు. మరికొందరు ఖుర్ఆన్ పఠిస్తూ, నమాజుల చేసుకుంటూ, అల్లాహ్ ను వేడుకుంటూ, ఉపన్యాసాలు వింటూ గడుపుతారు. రంజాన్ నెల మొత్తం రెస్టారెంట్లు పగలంతా మూసివేస్తారు. బహిరంగంగా తినకూడదని, తాగకూడదని హెచ్చరికలుంటాయి. అరబ్బులు గల్ఫ్ లోని అన్ని మసీదులలో రంజాన్ సందర్భంగా పౌష్టికాహారాన్ని నెల రోజుల పాటు ఉచితంగా సరఫరా చేస్తారు. అయితే బహిరంగంగా తింటూ కనిపిస్తే శిక్ష తప్పదు.
- మసీదుల ముందు బిక్షాటన చేసే వారికి కాకుండా ప్రభుత్వం ఆమోదం పొందిన చారిటీలకు మాత్రమే జకాత్ సొమ్మును ఇవ్వాల్సిందిగా ప్రభుత్వం విజ్ఞప్తి చేస్తుంది. గల్ఫ్ జైళ్లలో మగ్గుతున్న భారతీయుల వివరాలు పేర్కొంటూ ఈ పుణ్య మాసంలో వారికి క్షమాభిక్ష పెట్టి జైళ్ల నుంచి విడుదల చేయాల్సిందిగా ఇక్కడి రాజులకు భారతీయ దౌత్య కార్యాలయాలు ప్రత్యేక అభ్యర్థనలు చేస్తాయి. ఖురాన్‌ను కంఠస్థం చేసిన ఖైదీలను కూడా శిక్ష తగ్గించి విడుదల చేస్తారు. స్వదేశానికి వెళ్లడానికి విమానం టికెట్లకు డబ్బు లేకుండా జైళ్లలో మగ్గుతున్న భారతీయులకు మతంతో నిమిత్తం లేకుండా తమ జకాత్ సొమ్ముతో విమాన టికెట్లను అనేకమంది అరబ్బులు అందించడం విశేషం.

## ఇఫ్తార్ విందు

ఈనెలలో జరిగే 'ఇఫ్తార్ విందు'ల్లో ఆత్మీయత సహృద్భావాలు ప్రస్ఫుటం అవుతాయి. పరస్పర ధోరణికి, విశాల ఆలోచనా దృక్పథానికి ఇవి నిదర్శనం.

## ఏతెకాఫ్

ఈ విధంగా అత్యంత నిష్ఠనియమాలతో ఉపవాసదీక్షలతో గడిపే ముస్లింలు రాత్రింబవళ్ళు నమాజులో లీనమై వుంటారు. సాధారణంగా ముస్లింలు ప్రతిరోజు ఐదుసార్లు నమాజు చేయడం అందరికీ తెలిసిందే! వీటికి తోడు రంజాన్ నెలలో ప్రత్యేక ప్రార్థనలు జరుపుతారు. ఈ నెలలో సాయం సంధ్యవేళలో (ఇషా) ఫర్జ్ నమాజ్ తర్వాత అదనంగా ఇరవై రకాల 'తరావీహ్' నమాజు చేస్తారు. ఇది నెలంతా నిర్వహిస్తారు. దీనిలో ఖుర్ఆన్ మొత్తాన్ని అంటే మొదటి నుండి చివరి వరకు పఠిస్తారు. ఇది ప్రతి మస్జిదులో జరుగుతుంది. ఖుర్ఆన్ మొత్తాన్ని కంఠస్థం చేసిన హాఫిజ్ లు ఈ నమాజులను చదివిస్తారు. ఇంకా రంజాన్ నెల 21వ రోజు నుంచి చివరి వరకూ ఒక ప్రత్యేకత వుంది. అదే 'ఏతెకాఫ్'. 'ఏతెకాఫ్' అంటే ఒకరకమైన తపోనిష్ట. దీనిని పాటించ దలచినవారు మసీదులోనే ఒక ప్రక్క డేరాలా ఒక తెరను కట్టుకుని అక్కడ దైవధ్యానం, ప్రార్థనలు, ఖురాన్ పారాయణం చేయడంలో నిమగ్నమయివుంటారు. ఈ సమయంలో 'ఏతెకాఫ్ ' వున్నవారు బలమైన కారణం వుంటే తప్ప మస్జిద్ వదిలి బయటకు పోకూడదు.

## షబ్-ఎ-ఖద్ర్

కొంతమంది ముస్లింలు రంజాన్ నెలలోని 27వ తేదీన ' షబ్-ఎ-ఖద్ర్ ' జరుపుకుంటారు. దివ్యఖురాన్ ఈ రోజునే అవతరించిందని భావించే ముస్లిం సోదరులు ఆ రోజు రాత్రి జాగరణ చేసి ప్రార్థనలు చేస్తూ గడుపుతారు. ఆ రాత్రి భక్తితో కఠోరదీక్షతో ప్రార్థనలు చేసేవారికి 83 సంవత్సరాల పాటు ప్రార్థనలు చేసిన

ఫలం దక్కుతుందనే నమ్మకం వుంది. ఆ రాత్రి చేసే ప్రార్థనల వల్ల సర్వపాపాలు తొలిగి పోతాయని భావిస్తారు. ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రవచనం ప్రకారం ఈ రేయి రమదాన్ నెల చివరి పది రాత్రులలో ఏదో ఒక బేసి రాత్రిలో (అంటే 21, 23,25, 27,29 రాత్రులు) సంభవిస్తుంది.

## జకాత్

రంజాన్ నెలలో మరొక విశేషం అత్యధిక దానధర్మాలు చేయడం. సంపాదనా పరులైనవారు, సంపన్నులైనవారు రంజాన్ నెలలో 'జకాత్ ' అచరించాలని ఖురాన్ బోధిస్తోంది. ఆస్తిలో నుంచి నిర్ణీత మొత్తంను పేదలకు దానం చేయడాన్ని 'జకాత్' అని అంటారు. దీనిని పేదల ఆర్థిక హక్కుగా పేర్కొంటారు. దీని ప్రకారం ప్రతి ధనికుడు సంవత్సరాంతంలో మిగిలిన తన సంపదలో నుండి రెండున్నర శాతం [2.5%] చొప్పున ధన, వస్తు, కనకాలలో నుండి నిరుపేదలకు దానంగా యిస్తారు. పేదవారు కూడా అందరితో పాటు పండుగను జరుపుకొనడానికి, సంతోషంలో పాలుపంచుకునేందుకు ఈ 'జకాత్' ఉపయోగపడుతుంది.

## ఫిత్రా

'జకాత్' తో పాటు 'ఫిత్రా' దానానికి రంజాన్ నెలలో ఎంతో ప్రాముఖ్యత వుంది. మూడు పూటల తిండికి, ఒంటినిండా బట్టకు నోచుకోని పేదవారు ఎంతోమంది వున్నారు. ఇలాంటి దీనస్థితిలోని అభాగ్యులకు, పేదవారికి పండుగ సందర్భంలో దానం చేయాలని ఇస్లాం ఉద్బోదిస్తూవుంది. దీనినే 'ఫిత్రాదానం' అని పిలుస్తారు. ఉపవాసవ్రతాలు విజయవంతంగా ముగిసినందులకు దేవుడి పట్ల కృతజ్ఞతగా .. పేదలకు ఈ ఫిత్రాదానం విధిగా అందజేస్తారు. ఈ ఫిత్రాదానంలో దాదాపు 50 గ్రాములకు తక్కువ రెండు కిలోల గోధుమలను గానీ, దానికి సమానమైన ఇతర ఆహార ధాన్యాలను గానీ, దానికి సమానమైన ధనాన్ని గానీ పంచిపెట్టాలి. ఈ దానం కుటుంబంలోని సభ్యులందరి తరపున పేదలకు

అందజేయాలి. దీని వలన ఉపవాసాలలో జరిగిన సర్వపాపాలు హరించబడి, పుణ్యం దక్కుతుందనే నమ్మకం వుంది. ప్రవక్త ఫిత్రాధానాన్ని విధిగా నిర్ణయించ డానికి కారణం - ఉపవాస వ్రత నియమాన్ని పాటించే సమయంలో హృదయంలో కలిగే చెడు తలంపులు, ఆలోచనలు, నోటి నుంచి వెలువడే అసత్యాలు, పనికిమాలిన మాటలు వంటి పొరపాట్లు జరుగ వచ్చు. ఇలాంటి అనాలోచిత పొరపాట్లు అన్నీ ఫిత్రాదానం వల్ల క్షమించబడతాయి' అని ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం సహచరుడు అబ్దుల్లా బిన్ మసూద్ రదియల్లాహు అన్హు తెలిపాడు.

# షవ్వాల్

ఈ విధంగా రంజాన్ నెల అంతా పవిత్ర కార్యక్రమాలతో ముగుస్తూనే 'షవ్వాల్' నెల వంక ప్రత్యక్షమవుతుంది. ఈ నెలవంక దర్శనమిస్తూనే ముస్లిం సోదరులు నెల రోజులుగా పాటిస్తున్న తమ ఉపవాస వ్రతాన్ని విరమించి, మరుసటి రోజు 'రంజాన్' పండుగను అత్యంత భక్తిశ్రద్ధలతో, సంతోషానందాలతో జరుపు కుంటారు. "షవ్వాల్' నెల మొదటి రోజున జరుపుకునే రంజాన్ పండుగను 'ఈదుల్ ఫితర్' అని అంటారు.

# ఈద్‌ముబారక్

ఈ పండుగను పేద , ధనిక తేడా లేకుండా అత్యంత భక్తి ప్రపత్తులతో జరుపు కుంటారు. ప్రతి ఒక్కరూ కొత్త బట్టలు ధరించి పండుగ నమాజును ఊరి బయట నిర్ణీత  ప్రదేశాలైన ఈద్ గాహ్ లలో చేస్తారు. అనంతరం ఒకరికొకరు 'ఈద్‌ముబారక్' (శుభాకాంక్షలు) తెలుపుకుంటారు. ఈ నమజ్ కోసం వెల్లడానికి ఒక దారి, మరలి రావటానికి మరొక దారి ఎన్నుకోవటం సున్నత్. ఈ విధంగా పవిత్ర ఆరాధనలకు ధార్మిక చింతనకూ, దైవభీతికి, క్రమశిక్షణకూ, దాతృత్వానికి రంజాన్ నెల ఆలవాలం అవుతుంది. మనిషి సత్ప్రవర్తన దిశలో సాగడానికి ముహమ్మద్ ప్రవక్త బోధించిన మార్గాన్ని 'రంజాన్' సుగమం చేస్తుంది.